క్లుప్తంగా

నగరం ఎస్ఐగా భార్గవ్

నగరం: సాధారణ బదిలీలలో భాగంగా నగరం ఎస్ఐగా పనిచేస్తున్న పి.కోటేశ్వరరావు రేపల్లె టౌన్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో బండ్ల భార్గవ్ నియమితులయ్యారు. వీఆర్‌లో ఉన్న భార్గవ్‌ను నగరం ఎస్ఐగా నియమించారు. రెండురోజుల్లో ఎస్ఐ భార్గవ్ విధుల్లో చేరనున్నట్లు సమాచారం.

కొల్లూరు ఎస్ఐగా ఏడుకొండలు



కొల్లూరు : కొల్లూరు పోలీసు స్టేషన్ ఎస్ఐగా జి.ఏడుకొండలును నియమిస్తూ పోలీసు ఉన్నతాధికారులు శని వారం ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికల విధులకు ముందు ప్రకాశం జిల్లా నుంచి ఎస్ఐగా వచ్చిన రవీంద్రరెడ్డి స్థానంలో బాపట్ల జిల్లా కేంద్రంలో వీఆర్‌లో ఉన్న ఏడుకొండలును కొల్లూరు ఎస్ఐగా అధికారులు నియమించారు. నూతన ఎస్‌గా నియమితులైన ఏడుకొండలు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని పోలీసు సిబ్బంది చెబుతున్నారు.

ఘనవ్యర్థాల నిర్వహణ పర్యావరణానికి మేలు



వేమూరు: ఘనవ్యర్థాల నిర్వహణ పర్యావరణానికి ఎంతో మేలని ఎంపీడీఓ శేషగిరిరావు చెప్పారు. పచ్చదనం, పరిశుభ్రత, కాలుష్య నివారణ అంశాలపై సర్పంచ్‌లకు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఎంపీడీఓ పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు



భట్టిప్రోలు: అధ్యయనం–అధ్యాపనం–సామాజిక స్పృహ యూటీఎఫ్ నిర్మాణానికి ప్రధాన భూమికలని ఆ సంఘ మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు చెప్పారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయ ఆవరణలోని యూటీఎఫ్ భవనం వద్ద నాయకులు స్వర్ణోత్సవ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు వి.సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎస్ఎం ఆలీ, కె.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



తెనాలిఅర్బన్: సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ముందుకు సాగాలని దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి పేర్కొన్నారు. ప్రకాశం రోడ్డులోని ఎస్ఎస్ కంప్యూటర్స్ అకాడమి, జేవీఎస్ క్రాంతి కోచింగ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అతిథి గ్రాండ్‌లో కంప్యూటర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లతో సమయాన్ని వృధా చేసుకోకుండా ఉండాలని సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు మారాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కంప్యూటర్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కేఎల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ కె.సుబ్రమణ్యం, అకాడమీ డైరెక్టర్ జెట్టి విజయశేఖర్, జెట్టి ఎబినైజర్, ఎ.గిరిధర్, నూతలపాటి నాగేశ్వరరావు, యూ బాలరాజు, షేక్ అబ్దుల్ హకీంజానీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షకు 'మానవత' ఉచిత శిక్షణ

తెనాలి: ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ మానవత సంస్థ ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు భారత ప్రభుత్వం నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. శనివారం విలేకరుల సమావేశంలో సంస్థ, తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ నుంచి తెనాలి సమీపంలోని కుంచవరంలో గల మానవత ప్రాంగణంలో ప్రతి ఆదివారం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. దీనితోపాటు పరీక్ష మెటీరియల్‌ను ఉచితంగా అందజేస్తామని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

నమో వేంకటేశా..



వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

రేపల్లె రూరల్: పవిత్ర శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని పోటిమెరక ఎస్టీ కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి వేకువ జామునే సుప్రభాత సేవలతో అభిషేక మహోత్సవాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. ఆలయ ఆవరణలో భజనలు, కీర్తనలను ఆలపించారు. ఈ సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచార్ జంజనం హేమశంకరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంచేందుకు ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మండల కన్వీనర్ పేరం కోటేశ్వరరావు, రేపల్లె చెంచయ్య, శ్రీకృష్ణయ్య, బొల్లిముంత సుందరామిరెడ్డి, కామయ్య, వీర రాఘవయ్య, పున్నమ్మ, అర్చకులు కట్ట మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శరణం అయ్యప్పా...

విగ్రహ, జీవధ్వజ స్తంభ ప్రతిష్ఠా మహోత్సవం



దేవస్థానంలో ప్రతిష్ఠించిన అయ్యప్ప స్వామి



జీవ ధ్వజ స్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

నగరం: స్వామియే శరణమయ్యప్ప నినాదంతో నగరం గ్రామం మార్మోగింది. కొత్తగా నిర్మించిన ఓం శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవస్థానంలో శనివారం ఉదయం 9.28 గంటలకు సపరివార ధర్మశాస్త్ర అయ్యప్ప సహిత నూతన జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ స్వర్ణ వెంకట శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో శాస్త్రయుక్తంగా విఘ్నేశ్వర, అయ్యప్ప, కుమార స్వామి విగ్రహాలతోపాటు జీవ ధ్వజ స్తంభ ప్రతిష్ఠా కార్యక్రమం జరిపారు. అనంతరం కుంభాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలను కనుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి

కర్లపాలెం: అర్హులైన వారందరూ ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని లాయర్ బీమా లీలాకృష్ణ తెలిపారు. కర్లపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా లాయర్ మాట్లాడుతూ వితంతువులు అయి ఉండి వారికి పెన్షన్ రాకపోతే న్యాయ సహాయం చేసి పెన్షన్ వచ్చేలా చేస్తామని తెలిపారు. లాయర్ బీమా లీలాకృష్ణ వితంతువుల నుంచి అర్జీలు స్వీకరించారు. సదస్సులో పారా లీగల్ వాలంటీర్లు ఎస్.శ్యామ్యూల్‌జాన్సన్, కె.విజయరత్నం రాజు, పి.ప్రసాద్‌రావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



కర్లపాలెం: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించటంలో యూటీఎఫ్ శాఖ ముందంజలో ఉంటుందని యూటీఎఫ్ నాయకులు వి.శేషవర్మరాజు తెలిపారు. యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న యూటీఎఫ్ స్థూపం వద్ద ఉపాధ్యాయులు జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా శేషవర్మరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ప్రభాకర్, పోలీస్‌రావు, అజయ్‌కుమార్, బాపూజీ, డేవిడ్, విమలమ్మ, శ్రీనివాసరెడ్డి, ఏసుదాసు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనిక కుటుంబ సభ్యులకు ఉచిత మెగా వైద్య శిబిరం

బాపట్ల: మాజీ సైనిక కుటుంబ సభ్యులకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించారు. ఐఈఎస్ఎల్ ఢిల్లీ, బాపట్ల మాజీ సైనికుల కమిటీ పర్యవేక్షణలో కిమ్స్ హాస్పిటల్ వైద్యులు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. రాష్ట్ర సైనిక్ బోర్డు అధికారి వి.వెంకటరెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కిమ్స్ హాస్పిటల్ వైద్యులు వెంకటేశ్వరరెడ్డి, ఆనంద్, అశోక్, రామాంజనేయులు, స్వాతి పాల్గొన్నారు. మాజీ సైనికుల కమిటీ చైర్మన్ రెడ్డి శ్రీనివాస వరప్రసాద్, కాలీషా, ఖాదర్‌మస్తాన్, వంశీకృష్ణ,రెడ్డి ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఉచిత న్యాయ సహాయం



తెనాలిరూరల్: అర్హులైన వారికి తెనాలి మండల న్యాయ సేవ కమిటీ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తారని, అవసరమైన వారు దానిని సద్వినియోగపర్చుకోవాలని ప్యానల్ న్యాయవాది అప్పల కిషోర్ తెలిపారు. తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు ఆదేశాల మేరకు తెనాలి మండలం, కొలెవరం గ్రామంలో వితంతు సామాజిక పింఛన్లపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది మాట్లాడుతూ చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించి చట్ట పరిధిలో వ్యవహరించాలన్నారు. చట్టాలను ప్రజలకు చేర వేసేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పారా లీగల్ వలంటీర్ యర్రంశెట్టి అనిల్ కుమార్ మాట్లాడుతూ భారత దేశంలోని ప్రజలందరికీ ఎటువంటి భేదాలు లేకుండా అందరికీ సమాంతర న్యాయం అందించాలనే లక్ష్యంతో 1987లో న్యాయ సేవల చట్టం ప్రవేశపెట్టారని, 1995 నవంబరు 9వ తేదీ నుంచి ఈ చట్టం అమలులోకి వచ్చిందన్నారు. జాతీయ న్యాయ సేవాధికార మార్గదర్శకాలలో ఉచిత న్యాయ సహాయం పొందడానికి అర్హులుగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారికి, సంవత్సరానికి రూ.లక్ష ఆదాయం లోపు ఉన్న వారిని, మహిళలకు, బాలలకు, యాచకులకు, ప్రకృతి వైపరీత్యానికి గురైన వారికి, అసంఘటిత కార్మికులకు జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల న్యాయ సేవ సంస్థల్లో ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సయ్యద్ గౌస్ మొహిద్దీన్, పీఎల్‌వీ షేక్ మొహిద్దీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెల్లువెత్తిన బహుజనాగ్రహం

- విజయవాడలోని స్మృతివనంపై దాడికి నిరసన
- అంబేడ్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం



పెదపులివర్రులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఎంపీపీ లలిత కుమారి, చిత్రంలో పార్టీ నాయకులు



భట్టిప్రోలులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఎంపీపీ లలిత కుమారి, సర్పంచ్ రవి కిరణ్మయి, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు

భట్టిప్రోలు: విజయవాడ అంబేడ్కర్ స్మృతివనంలోని సామాజిక న్యాయ మహా శిల్ప శిలాఫలకాన్ని కక్షపూరితంగా కూటమి ప్రభుత్వం ధ్వంసం చేయడంపై బహుజనుల్లో నిరసన వ్యక్తమవుతోంది. జనాగ్రహం పెల్లుబికుతోంది. శనివారం భట్టిప్రోలులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడలో ప్రతిష్ఠించి స్మృతి వనాన్ని అభివృద్ధి చేసిందని గుర్తు చేశారు. ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. అలాంటి నాయకుడి పేరు శిలాఫలకంపై ఉండకూడదన్న కూటమి ప్రభుత్వ దుర్బుద్ధిని ప్రతిఒక్కరూ ఖండించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి, పంచాయతీ వార్డు సభ్యులు, కుక్కల భూషణరావు, పెరికల శ్యామ్, వైఎస్సార్ సీపీ నాయకులు కనపర్తి కోటేశ్వరరావు, గాడల్లి దేవదాసు, జల్లి జోషికాంత్, జడా రవీంద్రబాబు, కె. బాలు, ఫణి, రాజశేఖర్, పలువురు అంబేడ్కర్ వాదులు పాల్గొన్నారు.

- మండలంలోని పెదపులివర్రులో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూల మాలలు వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.
- భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని కోళ్లపాలెంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నీలా రమేష్ (చిన్నయ్య), జె.సాల్మన్, ఎం.నాగేంద్ర, ఎస్.పున్నారావు, ఎస్.వాసు, కె.నరసింహ, బి.రవి, బి.జక్రయ్య, బి.మునేష్, ఎం.వెంకన్న, కె.ప్రేమ్ చంద్, డి.ప్రకాష్, కె.నాగరాజు, ఎస్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దేశ నేతల త్యాగఫలమే స్వాతంత్ర్యం



భట్టిప్రోలు బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులనుద్దేశించి మాట్లాడుతున్న రమాదేవి

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

భట్టిప్రోలు: ఎంతోమంది దేశ నేతల ప్రాణత్యాగంతో స్వాతంత్ర్యం సిద్ధించిందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి పేర్కొన్నారు. భట్టిప్రోలులోని కేఎస్‌కే బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు క్విట్ ఇండియా స్ఫూర్తితో మహిళలపై జరుగుతున్న దాడులు, మత్తు పానీయాలను అరికట్టడం అనే అంశాలపై ఎస్ఎఫ్ఐ,-ఐద్వా (మహిళా సంఘం) ఆధ్వర్యంలో శనివారం సదస్సు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు పి.మనోజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో రమాదేవి మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ ఘట్టాలు, బాలికల హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు టి.సుభాషిణి, కేఎస్‌కే కళాశాల ఏవో శ్రీధర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో పశువుల పాకలు దగ్ధం

దూడ సజీవ దహనం, నాలుగు గేదెలకు గాయాలు



గాయాలపాలైన గేద



అగ్నిప్రమాదంలో మృతి చెందిన దూడ

రేపల్లె రూరల్: అగ్నిప్రమాదంలో పశువుల పాకలు దగ్ధమై మూగజీవాలు గాయపడిన పడిన ఘటన మండలంలోని అరవపల్లి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. అగ్నిమాపక శాఖ అధికారి వై.సాంబశివరావు తెలిపిన వివరాల మేరకు గ్రామంలోని తెనాలి సోమయ్య, తెనాలి వెంకట సుబ్బారావుకు చెందిన పశువుల పాకలు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమయ్యాయి. ఐదు గేదెలు, రెండు దూడలు మంటల్లో చిక్కుకున్నాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్రమత్తమైన స్థానికులు గేదెలను పాకలో నుంచి బయటకు తీసుకురాగా అప్పటికే ఒక దూడ సజీవ దహనమై ప్రాణాలు కోల్పోయింది. మరో దూడ, ఒక చూడి గేదె పరిస్థితి విషమంగా ఉండగా, మిగిలిన నాలుగు పశువులు గాయాలపాలయ్యాయి. ప్రమాదంలో రూ.6 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని అగ్నిమాపక శాఖ అధికారి తెలిపారు. సమాచారం తెలుసుకున్న తుమ్మల పశువైద్యాధికారి ప్రవీణ్ ఘటన స్థలానికి చేరుకుని పశువులకు వైద్యసేవలు అందించారు.

సేంద్రియ సేద్యంతో అధిక దిగుబడులు



జీవామృతం తయారు చేస్తున్న దృశ్యం

పిట్టలవానిపాలెం: సుస్థిర సేంద్రియ సేద్యంతో తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని మంతెనవారిపాలెం యూనిట్ సేంద్రియ సేద్య అధికారి ఎల్.టి.సౌజన్య తెలి పారు. గోకరాజునల్లిబోయినవారిపాలెం శివారు దివాన్‌తోట గ్రామంలోని వరి పొలంలో శనివారం జీవామృతం తయారు చేశారు. ఆమె మాట్లాడుతూ జీవామృతంతో వరి పైరు బలంగా పెరుగుతుందని తెలిపారు. జీవామృతం తయారీకి ఉపయోగించే పదార్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రవళిక, వరదానం, ఐసీఆర్పీ ఏసోబు పాల్గొన్నారు.

మాయగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

తెనాలిరూరల్: సినీ వ్యామోహం ఉన్న యువత మాయగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్ (మా–ఏపీ) వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా హితవు పలికారు. రూరల్ మండలం పెదరావూరు ఫిలిం స్టూడియోలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గుంటూరు, కృష్ణా, ప్రకాశం, ఉభయ గోదావరి జిల్లాల్లో సినిమా అవకాశాల పేరుతో మోసగాళ్లు కొందరు యువకులను డబ్బు అడుగుతున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందన్నారు. అనుమానం వచ్చిన కొందరు యువకులు విజయవాడ, మైలవరం నుంచి తెనాలిలోని మా–ఏపీ కార్యాలయానికి వచ్చి తనతో నిర్ధారణ కోసం సంప్రదించారని ఆయన తెలిపారు. పైగా ఇటీవల ఓటీటీ ప్లాట్‌ఫాంలు రావటంతో పాపులర్ ఓటీటీకి సినిమా తీస్తున్నట్లు ఆయా మోసగాళ్లు చెప్పడంతో యువకులు ఆకర్షితులై మోసపోతున్నారని, యువత జాగ్రత్తపడాలని సూచించారు.

డెంగీపై అవగాహన

తెనాలిఅర్బన్: డెంగీ వ్యాధి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పట్టణ మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ సూచించారు. ఐతానగర్‌లోని హయ్యర్‌పేటలో డెంగీ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యానికి దోమలు ప్రథమ శత్రువులని తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, శానిటరీ సెక్రటరీ సుధీర్, హెల్త్ అసిస్టెంట్‌లు షేక్ నవీద్,రషీద్ పాల్గొన్నారు.

టీడీపీపై ముస్లింల ఆగ్రహం

వేమూరు: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుకు తెలుగు దేశం పార్టీ మద్దతివ్వడంపై ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు ముస్లింల హక్కులను పరిరక్షిస్తామని హామీలు గుప్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇప్పుడు మైనార్టీలకు ద్రోహం చేశారని మండిపడుతున్నారు. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించిన వైఎస్సార్ సీపీని స్వాగతిస్తున్నారు. ఆ పార్టీ మైనార్టీల పక్షపాతి అని హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ముస్లింల హక్కులు హరించడమే



వక్ఫ్ ఆస్తులను అన్యాక్రాంతం చేసే దిశగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రపన్నుతోంది. దీనికి టీడీపీ వంతపాడడం సరికాదు. మైనార్టీల తరపున ప్రశ్నిస్తానన్న జనసేన కూడా బీజేపీకి మద్దతు పలకడం దారుణం. వక్ఫ్ సవరణ బిల్లు ముస్లింల హక్కులు హరించేదిగా ఉంది.

షేక్ హుస్సేన్, బాపట్ల జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్, అమర్తలూరు


వక్ఫ్ ఆస్తులపై కేంద్రం కన్ను



వక్ఫ్ ఆస్తులను కాజేసేందుకు ఎన్డీఏ ప్రభుత్వం కన్నేసింది. పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లు అదే. దీనికి టీడీపీ మద్దతు ఇవ్వడం దుర్మార్గం. మైనార్టీల ద్రోహిగా టీడీపీ చరిత్రలో నిలిచిపోతుంది.

– సయ్యద్ సిరాజుద్దీన్, భట్టిప్రోలు

బీజేపీ కుట్రకు టీడీపీ వంత



పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లుకు తెలుగుదేశం పార్టీ మద్దతు ఇవ్వడం దారుణం. చట్టం పేరుతో భూములను ఇష్టారాజ్యంగా వినియోగించుకోవాలని బీజేపీ కుట్ర పన్నుతోంది. వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని పన్నాగం పన్నింది. వెంటనే బిల్లును వెనక్కి తీసుకోవాలి.

– షేక్ బుజ్జి, జంపని

ముస్లిం సమాజంపై దాడే

వక్ఫ్ సవరణ బిల్లు ప్రవేశపెట్టడం, దానికి మద్దతు ఇవ్వడం అంటే ముస్లిం సమాజంపై దాడిగానే పరిగణించాలి. మోదీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం, ఈ చట్టానికి టీడీపీ ఎంపీలు మద్దతు పలకడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు.

షేక్ రఫీ, వేమూరు